జేఎన్‌టీయూహెచ్‌ చెస్‌ పురుషుల జట్టు ఎంపిక



ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో మంగళవారం చెస్‌ పురుషుల జట్టును ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ప్రొఫెసర్‌ ఎన్‌ఎస్‌ దిలీప్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నల్లగొండ అశోక్‌ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. జనవరి 8 నుంచి 11 వరకు చెన్నైలోని వెల్‌టెక్‌ యూనివర్సిటీలో జరిగే సౌత్‌ జోన్‌ ఛాంపియన్‌షిప్‌లో ఈ జట్టు పాల్గొననున్నట్లు సెక్రటరీ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ దిలీప్‌ తెలిపారు. సెలక్షన్‌ కమిటీ మెంబర్‌గా చెస్‌ చీఫ్‌ ఆర్‌బిటర్‌, ఎస్‌. సుబ్బరాజు వ్యవహరించారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు సెలక్షన్‌లో పాల్గొన్నారు.

మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌లోని పర్వత్‌నగర్‌లో మురుగునీరు ఓవర్‌ ఫ్లో కావడంతో గాయత్రినగర్‌ మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్‌ సబిహా బేగం మంగళవారం నూతన గ్రిల్స్‌ వేయించి మురుగు నీరు రోడ్డుపై పొంగి పొర్లకుండా, వర్షపు నీరు డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు చేరేలా పనులు చేయించారు. కార్యక్రమంలో వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ వినాయక్‌ రావు, సంజీవ్‌, రాజేశ్వర్‌, రమణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందజేత



జస్టిస్‌ సూరేపల్లి నందా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొర్లకుంట రమేష్‌

కేపీహెచ్‌బీకాలనీ: ఇగ్నైట్‌ విద్యాసంస్థల చైర్మన్‌ కొర్లకుంట రమేష్‌ విద్యారంగంలో చేసిన విశేష కృషికి విశ్వగురు వరల్డ్‌ రికార్డ్స్‌ అందజేసిన కామదేను స్టేట్‌ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం హైకోర్టు జస్టిస్‌ సూరేపల్లి నందా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో చేసిన సేవలకు పలువురు ప్రముఖులు కూడా పురస్కారాలను దక్కించుకున్నారు.

14న హరిహర క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ పి.నాగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న సాయంత్రం 5:30 గంటల నుంచి రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, 15న ఉదయం 6 గంటల నుంచి పుణ్యాహవాచనం, ఆదివాసి హోమం, పంచామృతాభిషేకం, గోదర్శనం, ఉదయం 9 గంటల 45 నిమిషాలకు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపు అయ్యప్ప మహా పడిపూజ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ఆటో స్టాండ్‌ 40 అడుగుల రోడ్డులో నవీన్‌ గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు వెంకట రమణ స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. మకరజ్యోతి భజన మండలి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భక్తి పాటల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అదేవిధంగా కూకట్‌పల్లి సర్కిల్‌ ఆల్విన్‌కాలనీ ఆదిత్య నగర్‌లో అనంతుల సాయికిరణ్‌ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 13న సాయంత్రం 6 గంటలకు మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో పూజలు



బండి రమేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యాదవులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్‌ సుమిత్రనగర్‌లోని చౌడేశ్వరి మాత ఆలయాన్ని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, సీనియర్‌ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తూము వేణు, మల్లేష్‌యాదవ్‌, నాయకులు మహేందర్‌, రాజు, నర్సింహ, పాండు, ప్రవీణ్‌, దుర్గయ్య, నవీన్‌, బాలేష్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వడ్డెర సంఘం మహిళా అధ్యక్షురాలిగా రమ

నిజాంపేట్‌: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కుచంపు రమ నియమితులయ్యారు. షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్‌ నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర యూత్‌ అధ్యక్షుడిగా నల్గొండకు చెందిన బొంత చిరంజీవి, యూత్‌ ప్రధాన కార్యదర్శిగా సంపంగి వెంకటేశ్‌ను నియమించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్‌, జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమలాదేవి, గుంజ రేణుక, జాతీయ యూత్‌ అధ్యక్షుడు రమేష్‌ మంజుల్కర్‌, రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమయ్య, రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు సాతల గోపాల్‌, గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు రేపన్‌ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలతో తాగునీరు కలుషితం!

లీకేజీలతో తాగు నీరు వృథా అవుతోంది. దీనికి తోడు కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కలుషిత నీటి సరఫరాలో వాటర్‌ బోర్డు అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. శుద్ధి చేసిన నీటికి బదులు కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని, తాగునీటి కష్టాలు తప్పటం లేదని స్థానికులు వాపోతున్నారు. గత్యంతరం లేక వాటిని వేడి చేసుకొని తాగుతున్నామని కూకట్‌పల్లి సర్కిల్‌ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మురుగునీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పైపులైన్లు లీకేజీలై నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న సంక్షేమ సంఘాలు

ఆల్విన్‌కాలనీ: కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోంది. పైపులైన్ల లీకేజీలు, గేట్‌వాల్వ్‌ల వద్ద గుంతలతో మురుగునీటిగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలు అయ్యి నెలలు గడుస్తున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించటం లేదు. కలుషిత జలాల సరఫరాతో విరేచనాలు, జ్వరాలు, గొంతునొప్పి వంటి రోగాల భారిన పడుతున్నారు.



ఆల్విన్‌కాలనీ బ్రిడ్జి వద్ద లీకేజీ అవుతున్న ప్రధాన పైపులైన్‌



ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ సమీపంలో ప్రధాన రహదారిలో పైపులైన్‌ పగిలి..

లీకేజీ ప్రాంతాలు ఇవే..

కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డు, ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రధాన పైపులైన్‌పై ప్రయాణించే వాహనాల ధాటికి పైపులైన్‌లు పగిలి గుంతగా ఏర్పడింది. కొన్ని నెలలుగా కలుషిత నీరు, చెత్తా చెదారంతో తాగునీరు కలుషితమై సరఫరా అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో, ఆస్‌బెస్టాస్‌ కాలనీ వాటర్‌ ట్యాంక్‌ వద్ద, పాపిరెడ్డినగర్‌ సమ్మక్క, సారమ్మ ఆలయం వద్ద మూల మలుపులో, కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయం ప్రధాన రహదారిలో, వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్‌లు పగిలిపోయాయి. అదే విధంగా ప్రతి రోజూ లీకేజీల కారణంగా నీరు రోడ్డుపై ప్రవహించి రహదారులు సైతం గుంతలమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



చిత్తారమ్మ దేవాలయం ప్రధాన రహదారిలో గేట్‌ వాల్వ్‌ లీకేజీతో..

116 కేంద్రాల్లో గ్రూప్‌-2 పరీక్ష

- ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహణ
- కలెక్టర్‌ గౌతమ్‌

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్‌ గౌతమ్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 116 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పేపర్‌-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్‌-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు కమిషన్‌ వెబ్‌సైట్‌ నుంచి హాల్‌ టిక్కెట్లను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని కలెక్టర్‌ సూచించారు.

◆ మొదటి సెషన్‌ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8:30 గంటల వరకు రావాలని, 9:30 తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించరన్నారు. రెండో సెషన్‌ అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 వరకే కేంద్రానికి రావాలని, 2:30 దాటితే ప్రధాన గేట్‌ మూసివేయవేస్తారని ఆయన పేర్కొన్నారు.

◆ అభ్యర్థులు ఎలాంటి క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్‌డ్రైవ్‌ లు, బ్లూటూత్‌ పరికరాలు, వాచ్‌, వ్యాలెట్‌, హ్యాండ్‌ బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్‌ ప్యాడ్లు, నోట్స్‌, చార్ట్‌లు, లూజ్‌ షీట్‌లు, ఆభరణాలు (మంగళసూత్రం, బ్యాంగిల్స్‌- సంబంధిత వస్తువులు మినహా) తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు బూట్లు ధరించకూడదని కలెక్టర్‌ సూచించారు. తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిబంధనల మేరకు హాల్‌ టికెట్‌లో సూచించిన విధంగా పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మాత్రమే గంట సమయం అదనంగా ఇవ్వబడుతుందన్నారు. వీరు సదరమ్‌ సర్టిఫికెట్‌/అపెండిక్స్‌ను పరీక్ష రోజున సంబంధిత చీఫ్‌ సూపరింటెండెంట్‌కి అందించాలన్నారు. హాల్‌ టికెట్‌పై ముద్రించిన సూచనలు చదివి అనుసరించాలని కలెక్టర్‌ సూచించారు.

రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు షురూ

కుత్బుల్లాపూర్‌: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు షాపూర్‌నగర్‌ పొట్లూరి నాగేశ్వర్‌రావు భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్‌ హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఏ దేశంలోనైనా అభివృద్ధికి మూలం కార్మికులేనని, కానీ ఆ ఫలితం మాత్రం పెట్టుబడిదారులు మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. కార్మికులు కేవలం ఉత్పత్తిలో భాగస్వాములై రాజకీయంగా దూరంగా ఉండడమే దీనికి ప్రధాన కారణమన్నారు. కార్మికులు రాజకీయ సైద్ధాంతిక అవగాహన కలిగి ఉంటేనే తగిన ఫలితం వస్తుందని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



విద్యార్థులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు . మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందజేసే మెనూ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అదే విధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాదగిరిగౌడ్‌, రవీందర్‌యాదవ్‌ పాల్గొన్నారు.

బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులు పూర్తి చేయాలి

లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్‌ టైప్‌ డ్రైన్‌ పనుల్లో వేగం పెంచాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్‌ ఆరికెపూడి గాంధీ తెలిపారు. లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.4 కోట్లతో చేపట్టిన బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులను కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బాక్స్‌ టైప్‌ డ్రైన్‌ పనులు తుదిదశలో ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటికే అనేక ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్‌, డీఈ ఆనంద్‌, ఏఈ భాస్కర్‌, నాయకులు యాదగిరి గౌడ్‌, రవీందర్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం

- విగ్రహ మార్పు సరికాదన్న నేతలు
- బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో నిరసనలు
- బతుకమ్మను తొలగించి తెలంగాణ సంస్కృతిపై దాడి చేశారని విమర్శ



క్షీరాభిషేకం చేస్తున్న మాజీ కార్పొరేటర్‌ శ్రావణ్‌ కుమార్‌ తదితరులు



గోవింద్‌ హోటల్‌ వద్ద క్షీరాభిషేకంలో కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ పిలుపు మేరకు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చినందుకు నిరసనగా ఎల్లమ్మబండకు వెళ్లే దారిలోని గోవింద్‌ హోటల్‌ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తల్లిని చూడగానే చేతులెత్తి దండం పెట్టే విధంగా ఉండాలని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, సాహితీవేత్తలు, రచయితల ఊహలు, వారి కవిత్వాల్లో తెలంగాణ సంస్కృతి నుంచి పుట్టిన రూపమే తెలంగాణ తల్లి అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నమైన బతుకమ్మ, చేనేత వస్త్రం పట్టుచీరను తొలగించటం తెలంగాణ సంస్కృతిపై దాడి చేయడమేనని విమర్శించారు. ఆశ వర్కర్లను పోలీసులతో కొట్టించటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిమ్మల సంతోష్‌రావు, మాచర్ల భద్రయ్య, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, ఎర్రవెల్లి సతీష్‌ రావు, రాములు గౌడ్‌, ఆంజనేయులు, జగదీష్‌ గౌడ్‌, యశ్వంత్‌, వాసు, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్‌ చౌరస్తాలో..

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, మాజీ కౌన్సిలర్‌ సీహెచ్‌. సత్యనారాయణ, డివిజన్‌ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి, తుకారాం, మనోజ్‌, రాజ్‌కుమార్‌, ఉదయ్‌, జోసెఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల కూల్చివేత

- అడ్డుకున్నా ఆగని అధికారులు
- ముందస్తు నోటీసులు లేకుండా కూల్చడంపై ఆగ్రహం





నోటీస్‌ ఇవ్వకుండా కూల్చివేశారని ఆవేదన చెందుతున్న మహిళ

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు కాలనీలో రోడ్డు పక్కన నిర్వహిస్తున్న చిరువ్యాపారాలను రోడ్డు ఆక్రమణల పేరుతో మంగళవారం అధికారులు కూల్చివేశారు. జీహెచ్‌ఎంసీ అధికారుల సహకారంతో ట్రాఫిక్‌ పోలీసులు రెండు జేసీబీలతో 9వ ఫేజ్‌లోని గోకుల ప్లాట్స్‌కు వెళ్లే డబుల్‌ రోడ్డు, బ్రాండ్‌ ఫ్యాక్టరీ నుంచి ఫోరం మాల్‌ వెళ్లే రోడ్డులో చిరు వ్యాపారుల డబ్బాలు, గుడిసెలను తొలగించారు. తమ షాపులను, చిరు వ్యాపారాలను కూల్చి తమ బతుకులను రోడ్డు పాలు చేయొద్దని పలువురు మహిళలు అధికారులను వేడుకున్నారు. అయినప్పటికీ వినిపించుకోకుండా కూల్చివేతలను చేపట్టారు. కనీసం తమకు ముందస్తు సమాచారం ఇచ్చినా తమ సామగ్రిని తరలించుకునే వారమని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి స్వయం ఉపాధిని పొందుతున్న తమ బతుకులను రోడ్డు పాలు చేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ డీసీపీ వీరన్న, ఏసీపీ హనుమంత్‌, సీఐ జానయ్య, మూసాపేట సర్కిల్‌ ఏఈ సాయి ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. బతుకమ్మబండకు చెందిన కృష్ణ కుమారుడు ప్రణవ్‌ అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా గ్రోత్‌ హార్మోన్‌ ఇంజక్షన్‌ చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఆయన.. సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పథకం కింద రూ.2.10 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి సదరు పత్రాన్ని పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు.

బైకును ఢీ కొట్టిన కారు

- బాలికకు తీవ్ర గాయాలు

కేపీహెచ్‌బీకాలనీ: అతివేగంగా దూసుకువచ్చిన ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రగతినగర్‌ రోడ్డులోని తరుణ్‌ విహార్‌ అపార్టుమెంట్‌లో నివాసం ఉండే మేదురి అశోక్‌ చక్రవర్తి భార్య, రెండున్నర ఏళ్ల కూతురు ఇటీవలే ఊరికి వెళ్లారు. సోమవారం రాత్రి తిరువూరు నుంచి ఆర్టీసీ బస్సులో మంగళవారం ఉదయం 4 గంటలకు కేపీహెచ్‌బీ బస్టాప్‌కు వచ్చారు. వారిని అశోక్‌ చక్రవర్తి తన పల్సర్‌ బైక్‌పై ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు బైకును ఢీకొట్టడంతో భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. రెండున్నర ఏళ్ల కూతురుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్‌ మద్యం మత్తులో ఉన్నట్లు బాధితులు తెలిపారు.

ఎఫ్‌ఈడీసీయూటీఏ కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం: ఫెడరేషన్‌ ఆఫ్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ టీచర్స్‌ అసోసియేషన్స్‌ (ఎఫ్‌ఈడీసీయూటీఏ)లో మహిళలకు అగ్రస్థానం కల్పించారు. ఎఫ్‌ఈడీసీయూటీఏ చరిత్రలో మొదటిసారిగా ఇద్దరు మహిళలను అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నుకున్నారు. రెండురోజుల క్రితం న్యూఢిల్లీలోని జవహర్‌లాల్‌ నెహ్రూ యూనివర్సిటీలో జాతీయ కార్యవర్గ సమావేశంలో జేఎన్‌యూ టీచర్స్‌ అసోసియేషన్‌ నుంచి ప్రొఫెసర్‌ మౌసమి బసు అధ్యక్షురాలిగా, గచ్చిబౌలిలోని మనూ యూనివర్సిటీ టీచర్స్‌ అసోసియేషన్‌ నుంచి డాక్టర్‌ షబానా కేసర్‌ సూరి ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.